

# దూరపు కొండలు

నల్లూరి రుక్మిణి

“బై మమ్మీ... బై... డాడీ... బై,” రణగొణ ధ్వనుల మధ్య, పరుగులూ ఉరుకులూ మధ్య, ఈ మాటలే గాలిలో తేలియాడుతున్నాయి.

“చెకిన్ అయిందా?... వెయిట్ ఎలౌవ్ అయిందా?... బోర్డింగ్ పాస్ ఇచ్చారా?... అమ్మయ్యా, ఇక ఫరవాలేదు.”

అన్నీ ముగించుకుని, బంధువులకూ, ప్రయాణీకులకూ అడ్డుగోడలుగా వున్న కటకటాల దగ్గర కొచ్చాడు రఘునందన.

అప్పటిదాకా ఎయిర్‌పోర్టులో ట్రాలీల్లో సామాను వేసుకుని పరిగెత్తుతున్న పాసింజర్స్‌ని, చేతిలో వాకీ టాకీలు పట్టుకుని గిరగిరా తిరుగుతున్న ఎయిర్ హోస్టెస్‌ని- మెడలో లేబిళ్లు వేళ్లాడేసుకుని తిరుగుతున్న సిబ్బందిని, కన్నీళ్లు పెట్టేవాళ్లను- కన్నీళ్లు ఆపుకునేవారిని- బాధతో ముఖాలు దించుకుని సెక్యూరిటీ సర్కిల్లో కెళ్లే పిల్లలను గమనిస్తున్న సుమిత్ర... కొడుకు రాకతో, తానూ కొడుకు ధ్యాసలోకి మారింది.

ఎయిర్‌పోర్ట్ అంతా ఖరీదు ఖరీదుగా వుంది. ఖరీదుల మధ్య కన్నీళ్ల చారలూ వున్నాయి. ఏదో దిగులు సుమిత్రనూ ఆవహించింది. కొడుకు చెయ్యి మౌనంగా పట్టుకుంది. మరో పదినిమిషాలు... అంతే... ‘మళ్లెప్పుడో? ఏడాదా? రెండేళ్లా?’

అది అటు తల్లికి, ఇటు బిడ్డకూ కూడా తెలియదు.

సుమిత్రకు మాటలు రావడంలేదు. ఇదా తను కోరుకుంది... ఎంతగా తరతరానికి ఆలోచనలు మారిపోతున్నాయి. బతుకులు వెదుక్కుంటూ ఎక్కడెక్కడికో అంతులేని ప్రయాణాలు... అవసరమా?...

తనకు అర్థంకావడం లేదో- చేసుకోలేకపోతోందో, తనకే తెలియడంలేదు.

పిల్లలు ఒక్కపూట దూరంగా వుంటే భరించలేక పోయేదే... బడి నుండి పావుగంట ఆలస్యమయితే గేటులో వేళ్లాడేదే!... మరి ఈ సుదీర్ఘమైన ఎడబాటు... ఎప్పటికీ మరి దగ్గరుండరనే ఈ బాధ?

“చాదస్తం... పిల్లలు చిన్నప్పుడు నీ చెంగు పట్టుకు తిరిగినట్లు, నీ చుట్టూ తిరగాలని నీ కోరిక... వయసు వచ్చింది. వాళ్లూ స్థిరపడాలనుకోరూ... ఈ దేశంలో ఉంటే మాత్రం... నీ దగ్గరే వుంటారా?”

“వాళ్లు చదివిన చదువులకు, గుంటూర్లో ఏం ఉద్యోగాలొస్తాయి, ఆడపిల్లలు సహితం పోతున్నారెంతెంతో దూరం. ఏ ఢిల్లీయో, బొంబాయో అయితే మాత్రం నెలకోసారి వచ్చి నీ దగ్గరే కూర్చుంటారా?... సెంటిమెంటల్ ఫూల్‌వి”... తరచుగా భర్త దీవనలివే.

రఘునందన పిలుపుతో సుమిత్ర మామూలుగా వుండే ప్రయత్నం చెయ్యసాగింది.

దిగులుగా వున్న తల్లి మొహం చూసి, “మళ్లీ వచ్చే ఈరోజుల కల్లా వస్తానుగా మమ్మీ. అయినా మీరూ పాస్‌పోర్టు తీసుకోవచ్చుగా... మధ్యలో వచ్చి వెళ్లవచ్చు... చెప్తే వినరూ...”

ఇంతలో, “బొంబాయి వెళ్లే జెట్ పాసింజర్స్ మీరేనా,” అంటూ ఎయిర్‌హోస్టెస్ హడావిడిగా పిలిచింది.

తొందర తొందరగా ఆమెతో పాటు సెక్యూరిటీ జోన్‌లోకి వెళ్లిపోయాడు రఘునందన.

వీడ్కోలు చెప్పడానికొచ్చిన బంధువులంతా తిరుగుముఖం పట్టారు.

పిల్లలక్కడే వున్నారన్న ఫీలింగుతో కొందరు అద్దాలగుండా విమానం ఎగిరేదాకా ఆత్రుతతో చూసే గుంపులో సుమిత్రా చేరింది.

విమానం ఎగరగానే సుమిత్ర నీరసంగా లాంజ్ లో కూర్చుంది.

సుమిత్ర వాలకం చూసి, తనతోపాటు వచ్చిన ఆడబడుచు మందలించసాగింది "ఏమిటీ మరీ అంత ఫీల్ అవుతావు... ఈ రోజుల్లో ఇంటికొకరో, ఇద్దరో వెళు తున్నారు... వెనకటిలాగా ఊరికొకరు కూడా విదేశాలు పోని రోజుల్లో.... సమాచారాలూ సరిగ్గాలేని రోజుల్లో.... బాధపడ్డా అర్థం వుంది... ఇప్పుడు తెల్లారి లేస్తే ఫోన్లు... ఈమెయిల్స్... మనం ఇంటి కెళ్లేటప్పటికి వాడు ఫోను చెయ్యనే చేస్తాడు... లే... లే... నడువ్."

సుమిత్ర ఏం మాట్లాడకుండా ఎయిర్‌పోర్ట్ బయటకు నడిచింది. ఎవరెన్ని చెప్పినా మనసులో దుఃఖం ఆగిందికాదు. పిల్లలే ప్రపంచమన్నట్టు బతికింది తాను... తనకు పిల్లలు తప్ప మరోటి లేదన్నట్టు పాతిక సంవత్సరాలుగా జీవితం గడిచిపోయింది.

ప్రేమ కోసం... మనిషి స్పర్శకోసం... తానెంత సుళ్లు తిరిగిందీ... చిన్ననాడో... గలగలా దూకే వురవడి లాగా... ఆ పల్లెల్లో చుట్టూ జనం... కనబడితే పలకరిం పులు... మాటలు... ఈర్ష్యలు... తగాదాలు... అయితేనేం అంతా మనుషుల చుట్టూనే... ఇలా మౌనాలతో యుద్ధాలు చేసుకుంటూ బిగుసుకుపోయేవారు కాదు.

ఇదిగో అక్కడి నుండి అగాధంలోకి దూకినట్లు ఈ డబ్బు ప్రపంచంలోకి ఎలా వచ్చాను!... ఏం పోగొట్టు కున్నానో... ఏం పొందానో... నాకే అర్థం కావడంలేదు... చదువులు.... చదువులు... ముందుకా... వెనక్కా? ఇప్పటికీ అంతుచిక్కడం లేదు.

తల్లి పేగేదో తెగిపోయిన కడుపుకోత వెంటాడు తూనే వుంది.

ఒక్క చల్లని మాటకోసం... ఒక్క కౌగిలింత... ఒక్క ఆలింగనం కోసం... ఏకాంతంలోనైనా ఓ మెచ్చు కోలు మాట కోసం... కనిపించని రంపపుకోత... ఏళ్ల తరబడి దుఃఖాలు... ఎందుకీ జీవితాలూ...

హేళన... వెక్కిరింతలు... చులకన చూపుల మధ్య... అవి తప్పించుకోవడానికి... మనిషి పట్ల నిర సనను భరించలేక... పిల్లల చుట్టూ అల్లుకుపోవడం... పొరలు, పొరలుగా జ్ఞాపకాలు.

"సుమిత్రా... సుమిత్రా..." భర్త పిలుపుతో ఈ లోకంలో కొచ్చింది. ఎయిర్‌పోర్ట్ దాటి అమీర్‌పేట ప్రాంతాలకు వచ్చింది కారు.

"ఏమిటి నీ మూడ్ ఇంకా సెట్‌రైట్ కాలేదా?"... సుమిత్ర మీద జోక్స్ వెయ్యసాగారు భర్త, ఆడ బడుచూనూ. వారి మాటలకు నవ్వి ఊరుకుంది. తిరిగి వారి సంభాషణల్లో వారు పడిపోయారు.

సుమిత్ర సోఫాలో జారగిలబడి కళ్లు మూసు కుంది... అయిపోయింది... అంతా అయిపోయింది... పిల్లల మాటల్లో 'శుభం' కార్డు వెయ్యటమే మిగిలి పోయింది. ఇక మిగిలింది వాళ్ల పెళ్లిళ్లే... దానిలోనైనా తనకు ఆసక్తి వుంటే బావుండేదేమో... ఎవరి పెళ్లిళ్లు వాళ్ల యిష్టమని నమ్మే తనకు... మామూలుగా వుండే ఉత్సా హాలేముంటాయి. మరిప్పుడు దేని కోసం... ఏ ఆరాటం లేకుండా... బతుకెంత నిరాశగా, నిర్లిప్తంగా వుంటుందో కదా! ... చాలామంది జీవితం మీద చావని ఆశతో, మాట్లాడుకుంటుంటే, తనకెంత చేదుగా వుంటుందో!...

"బోలెడు ఫెసిలిటీస్ వచ్చాయి... కొత్త కొత్త డ్రగ్సు వచ్చాయి... ఏ ఆపరేషన్ అయినా నిమిషాల్లో అయిపో తుంది... యాభై ఏళ్లంటే మంచి నడిమి వయస్సు... డెబ్భైదాకా సుబ్బరంగా తిరగొచ్చు... లైఫ్ రేటు పెరగలా!..." ఎంత ఉత్సాహమో మాటల్లో...

'ఏం చేస్తారు డెబ్భై ఏళ్లు బతికీ... ఈ యాభైల జీవితమే బోరు కొడుతుంటే!...' అట్లా ఆలోచించు కుంటుంటే నవ్వు వచ్చింది... ఏమిటో ఈ నిరాశ... నిర్లిప్తత... గడచిన జీవితంలోని స్ట్రగులూ... విలువలు... ఉద్యమాలు... పోరాటాలు ఏమీ నేర్పలేదా?... అందరి లాంటి వారిమి కాదన్న ధీమా దేనివల్ల? మనమేదో భిన్నమనుకుని తృప్తిపడటం ఏం చూసుకుని?

'ప్రజాస్వామ్యం... హక్కులు... సంస్కృతి...' పదాలు... పదాలు అంతేనా? 'అయితే ఇన్నేళ్లుగా ఎందుకు చేసినట్లు... మనమున్నామని మనవైపు కొంద రైనా చూస్తున్నారంటే ... మనవల్ల సమాజానికి ఈషణ్మా త్రమైనా మేలు జరగలేదా?'

సుమిత్ర మనసు ముందుకూ వెనక్కూ గుంజా టన పడసాగింది.

ఇప్పుడైతే అదీ చేసే పరిస్థితే లేదు. అన్ని రకా లుగా ఎన్ని మార్పులో... మారిన పరిస్థితులను ఆసరా చేసుకుని హిపోక్రసీ పెరిగిపోలేదూ... మాట్లాడటమే ఫాషనయింది.

'వేరు పురుగు చేరి వృక్షంబు చెరచును'... ఇది నిజంగా వృక్షమేనా... ఎంతమందిలో ఈ సందేహాలు... అయినా అంతకంటే మరో మార్గం చూపినవాడేడీ? జనానికి, మనవెనక ఎవరో వున్నారన్న ధైర్యం... ఈ ఉద్యమాలుకాక, మరే మార్గం ఇవ్వగలుగుతున్నాయి? ఈమాత్రం అడిగేవారే లేకపోతే ఈ రాజకీయ నాయకులకు అడ్డేముంది... కానీ ఈ పాజిటివ్ అంశాన్ని చూడటానికి ఈ హిపోక్రాట్స్ కళ్లు మూసుకుంటున్నారు. వీళ్లతోనే తలనొప్పి... ఉద్యమాలను వీరి నుండి రక్షించడమే పెద్ద పనైపోయింది !

ఎటెటో తిరిగి వచ్చింది సుమిత్ర మనసు. ఏదీ మనసుకు ఆనడం లేదు. భవిష్యత్తు జీవితంలో వేగం, ఉద్వేగం లేకుండా నీరసంగా గడపాల్సి వస్తుందేమోనన్న భయం, నీడలా కమ్ముకోసాగింది.

'చప్పచప్పగా జీవితం... ఏం చెయ్యనూ!...' రఘునందన మాటలు గుర్తుకొచ్చాయి. "అక్కడ కూడా డబ్బులు కోసం పడి పడీ సంపాదించేవాళ్లు వుంటూనే వుంటారు మమ్మీ... ఇక్కడి నుండి పప్పులు, ఉప్పులు, ఊరగాయలూ తీసికెళ్లి వండుకుంటూ, ప్రతి పైసా పొదుపు చేసి ఇక్కడికి పంపాలనుకునేవాళ్లే ఎక్కువ మమ్మీ... కేవలం డబ్బుకోసమే ఆ దేశం వచ్చినట్టుంటారు... ఆ దేశం చూద్దామని... నేర్చుకుందామని వుండే వాళ్లు కనబడరసలు... ఇక్కడి నుండి వచ్చే పెద్దవాళ్లకు సహితం ఏదో ఒక కోర్సు నేర్చుకుని సంపాదించాలనే ఆరాటం మమ్మీ."

అట్లా డబ్బు మీద అపరిమితమైన కాంక్ష వున్నా బతకొచ్చునేమో?... సంపద... ఆస్తి... డబ్బు... తరాల కోసం దాచిపెట్టాలనే కాంక్ష... ఆ వ్యామోహాలే వాళ్లకి బతుకుల మీద ఆశని నిలిపి... ఉత్సాహపరుస్తుందేమో... సుమిత్ర తలపోయసాగింది.

తన కజిన్‌ను దృష్టిలో పెట్టుకుని కొడుకు మాట్లాడిన మాటలు గుర్తుకు రాసాగాయి. "చూడు మోహన్ అంకుల్... రెండు చేతులూ చాలడం లేదు సంపాదించడానికి... వున్న ఇద్దరి పిల్లలకే సంపాదించిన కోట్లు చాలవన్నట్లు ఎంత ఆరాటమో... మనలాగా దొంగడబ్బు మూటలు కట్టుకోవాలనుకోరు మమ్మీ... కష్టపడతారు... అయాచితంగా చిన్నపని చేయించుకోరు తెలుసా... వ్యక్తిత్వంతో బతకొచ్చు... ఒకరికి తలొంచనక్కరలేదు... ఎక్కడైతేనేం, మనకు బావుండాలేగానీ..."

కొడుకు మాటలు అన్నీ బావుంటాయి ...కానీ ఆ చివరి వాక్యమే సుమిత్రకు ఆరాటం కలిగించేది.

"అంటరానితనం మనసెంత క్షోభకు గురి చేస్తుందిక్కడ. మనదేశంలో ఎప్పటికీ మారని జాడ్యంలా పట్టుకు వేళ్లాడటం లేదూ, కానీ అక్కడ? స్కావెంజరైనా, గార్డెనర్ అయినా మన కప్పు... మన ప్లేటు... మన సోఫాలు... మనతో సమానంగా షేర్ చేసుకోవాల్సిందే... బ్లాక్స్, వైట్స్ జాతి భేదమున్నా... అంటరానితనం లేదు... మనుషుల్ని అవమానం చేసే నీచత్వం అక్కడ లేదు మమ్మీ... ప్రతి ఒక్కర్నీ పేరు పెట్టి గౌరవించాల్సిందే... ఇటువంటి స్థితి మీరు చేసే ఉద్యమాల ద్వారా ఎన్నేళ్లకు ఎన్ని దశాబ్దాలకు సాధిస్తారో చెప్పు, మన సమాజంలో..."

రఘునందన వాదన మౌనంగా విన్నది సుమిత్ర... వాడు చూసిన ఈ కొద్ది సంవత్సరాల జీవితం వాడికి అంతే అర్థమయిందనుకుని... "తప్పురా రఘూ నీ ఆలోచన, అవగాహనా తప్పురా... నువ్వు అమెరికాలో చూసిన జీవితమెంతా? ఆవగింజలో ఆరోవంతు కూడా లేదు. అక్కడి నల్లవాళ్ల జీవితం మీలాంటి డాక్టర్లకో... ఇంజనీర్లకో ఎలా తెలుస్తుంది... మీరు వుండే మెగా సిటీల్లో వారికెక్కడిదీ చోటు... ఒకవేళ వున్నా వాళ్ల తెలివితోనో, స్వయంకృషితోనో పైకొచ్చినవాళ్లే కదూ... ఇప్పటికీ నల్లవాళ్లను తెల్లవాళ్ల స్కూళ్లలో చేర్చుకోని స్థితిలేదూ? వాళ్లేనా... ఆ దేశం మూలవాసులైన 'రెడ్ ఇండియన్స్' పరిస్థితేమిటి? చివరకు వాళ్లను సినిమాల్లో దొంగలు, దోపిడీదారులుగా చూపించడం లేదూ? అంతేగానీ, సమానస్థాయి ఎక్కడుందీ...

"వాళ్లనుభవించే జీవితాలు చూడాలంటే... నువ్వు ఆ డౌన్ టౌన్సులోనో... వాళ్లుండే కాలనీల్లో... 'గెట్టోస్'లకు వెళ్లి వాళ్లతో కలిసి గడపాలి. ఎంత హీనమైన జీవితం, వేదనా లేందే ఆ కాలనీల్లో బతికేవారు అంతగా ఫ్రస్ట్రేషన్‌కి గురవుతారో... ఆలోచించు. 'ఏడుతరాల' కథ చదివావుగా... ఏం అర్థమయిందీ? బానిసలుగా... పశువుల కంటే హీనంగా... తాళ్లతో కట్టివేసి కొట్టి... మానభంగాలు చేసి... వెంటాడి, వేటాడి, చంపలేదూ... గొడ్లను అమ్మినట్లు బానిసలను కుటుంబాల నుండి విడదీసి భార్యాపిల్లలను, తల్లీబిడ్డలను ఇష్టమొచ్చినట్లు అమ్మేయలేదూ... అమెరికా చరిత్ర నిన్న మొన్నటిదాకా ఏమిటి? ... మనకు 'కులం' ప్రాముఖ్యం కనుక అంటరానితనం అంత వికృతంగా కనిపిస్తుంది. పైగా మనకు నిత్యం అనుభవంలోకి వచ్చే విషయం... కానీ అవతలి ఒడ్డు అంత సుందరమైందేమీ కాదు రఘూ... కాకపోతే దాని లోతులు మనకు తెలియ

వంతే... నువ్వు చెప్పే ఆ సమానత్వం... కష్టానికి గుర్తింపే గాని... విలువల గుర్తింపు కాదు.''

రఘునందన మౌనం వహించాడు.

వాడు చూసిన ఆ చిన్ని జీవితంలోని అనుభవాలు వాడికలా అనిపించి వుండవచ్చుననుకో సాగింది.

వాడెన్నిసార్లు, 'మనదే కులమమ్మా' అని అడగ లేదూ?... హైస్కూలు వెళ్లేదాకా పిల్లలకా ధ్యాసే లేదు... ఎవరన్నా అడిగినా 'కమ్యూనిస్టు కులం' అనేవారు కాదూ... తరువాతగాని అది కులం కాదని, పార్టీ అని తెలిసింది!

ఆ తరువాత... ఆ తరువాత ఎన్ని చేదునిజాలు అనుభవంలోకి వచ్చాయి వాళ్లకు.

'మీ అమ్మా ... నాన్నా ... ఇంటర్‌కాస్టా,' అంటే వీళ్లు చెప్పీ చెప్పగానే... అడిగిన వాళ్ల మొహాల్లో ఆశ్చర్యార్థకపు ప్రశ్నలు... మొహాల తీరు... ఇమిటేట్ చేసి ఎంత నవ్వించేవారు!

పిల్లల అల్లరి... అల్లరిలోనే వాళ్ల అనుభవాలు... నవ్వుతూ నవ్వుతూ ఎలా అధిగమించారు. ఎక్కడో, ఏదో జరిగిందనగానే పోలీసుల హడావిడి... ఇంట్లో టెన్షన్... సోదాలు, అన్నీ అనుభవాలు...

పిల్లలు చిన్నవాళ్లుగా ఉన్నప్పుడు ఉద్యమాలెంత ఉచ్ఛస్థితిలో వున్నాయి. చిన్నపిల్లలైనా వాళ్లను తీసుకునే వూళ్లన్నీ తిరగలేదూ... ఊహలు తెలుస్తున్నకొద్దీ వాళ్లు చూసినవన్నీ పంతాలు, పట్టింపులు, చీలికలు, గందరగోళాలు, బహిష్కరణలు, నిష్క్రమణలు... ఇవేగా... మహావృక్షాలు సహితం కూకటి వేళ్లతో కూలిపోతున్న దృశ్యాలు... అందుకే వాళ్ల చూపును ఏవీ నిర్దేశించలేక పోయాయి.

క్రమంగా చదువులు... చదువులు... చదువులతో పాటు కొత్త స్నేహాలు, కొత్త ప్రపంచం... ఇంటి పరిధిని దాటినవారి ఆలోచనలు... అనుభవాలు... విద్యార్థి లోకంలో వచ్చిన మార్పులు... జీవితం అనుభవించడానికేనన్న ధోరణి ఈ తరాన్నెంత ప్రభావితం చేసిందీ... అంతా కంప్యూటర్... ఇంటర్‌నెట్... ఇన్‌ఫర్మేషన్... విదేశాల్లో అయాచితంగా సంపాదించాలనే దృక్పథం మనుషుల ఆలోచనలను ఎంతగా మార్చాయి. పైపైకి ఎగబాకాలనే ధోరణిలో తోటి మనుషుల గురించి పట్టించుకునే స్థితి ఎంతగా లేకుండాపోయిందీ? ... ఇవి పిల్లల మీదేనా? ... పెద్దలమీద మాత్రం పనిచెయ్యడం లేదూ? అయినా రఘునందనకు మనుషుల పట్ల ప్రేమ, ఎటాచ్‌మెంట్ ఎంత ఎక్కువో? ఇంటికొచ్చిన వారిని మామయ్యా అంటూ వదిలేవాడేకాదు... కానీ అటువంటి రఘునందనకు ఆ జీవితం నచ్చినట్లు కన్పిస్తోంది... అదే సుమిత్రను భయపెడుతోంది.

అక్కడికి వెళ్లిన వాళ్లంతా... తిరిగి వస్తామన్న వాళ్లు కూడా అక్కడే వుండిపోతున్నారు.. టెక్నాలజీ సౌకర్యాలు, వాతావరణం ఇక్కడికి రావడాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది... అది తలచుకుంటే మనసు గాయమవుతోంది సుమిత్రకు...

మరి ఈ ఇరవైఏళ్లుగా మామధ్య బంధం వట్టిదేనా?... ప్రతి మాటా, చిన్న పని... అమ్మతో చెప్పందే నిద్రపోయేవాడు కాదే... స్కూలు... ఫ్రెండ్స్ అన్నీ...

చిన్న జ్వరం, చిన్న దెబ్బ... ప్రతిదానికీ పని చేసుకోనివ్వకుండా, కూర్చో మమ్మీ అంటూ వేళ్లాడేవాడే?... ఇవన్నీ వట్టి గుర్తులేనా?'

పోనీ గతం అలా వుంచు... భవిష్యత్తు వున్న పిల్లలు... మనకోసం కనిపెట్టుకుని కూర్చుంటారా?... కానీ శెలవలకంటూ వచ్చిన ఈ నెలరోజులూ... క్షణాల్లో గడిచిపోలేదూ! మాటలు, కోపాలు, సరదాలు... ఎన్నీ! మనసుకెంత బలం!

రఘునందన వుండగా జరిగిన సంఘటన మనసులోకొచ్చింది.

ఆరోజు సుబ్బలక్ష్మి మొగుడు వచ్చి ఏం వాగాడు? ''నీ మూలంగానే నా పెళ్లాం చెడిపోయింది. కుక్కిన పేనులాగా పడి వుండేది... మహిళా సంఘమట... మహిళా సంఘం... ఆడోళ్లను కాపురాలు చెయ్యకుండా చెడగొట్టటమేగా? తిరుగుబోతు...''

అప్పటిదాకా, ఇంట్లో ఏవో కాసెట్సు వింటూ వున్నవాడు... అతని మాటలకు గబగబా బయటకు వచ్చి, 'ఏంటిరా కూస్తున్నావ్... మళ్లీ మాట్లాడు,' అంటూ క్షణాల్లో దగ్గరకెళ్లి కొట్టబోయినంత పని చెయ్యలేదూ... తనకే భయం వేసింది... తొందరపడి ఎక్కడ చెయ్యి చేసుకుంటాడోనని...

అప్పటిదాకా గయ్యి గయ్యిమంటూ అరుస్తున్న సుబ్బలక్ష్మి మొగుడు రఘునందన కోపం చూసి, ''అది కాదు సార్... మా ఆవిడ నాతో పోట్లాట పెట్టుకుని వేరే వెళ్లిపోతానంటోంది... దానికి మీ అమ్మగారు సపోర్టు చేస్తున్నారు సార్,'' అంటూ నీళ్లు నమిలాడు.

''అయితే కోర్టులో తేల్చుకో ఆ విషయం... అయినా అన్నేళ్లు కాపురంచేసి కూడా... నా భర్తని వదిలి వుండలేనని, చేసుకున్నదానితో అనిపించుకోలేని వాడికి

కాపురమెందుకూ! మహానుభావుడివి, ఆవిడనేనాడూ సుఖపెట్టి వుండవు... నీలాంటి వాడిని వదిలిపెట్టి పోకేం చేస్తుందీ? పాపం ఆవిడ ఎన్ని కష్టాలు పడకపోతే, ఆ నిర్ణయం తీసుకుంటుందీ? మంచిపనే చేస్తోంది... ఇక అరవకుండా బయటికి నడువ్.''

అదంతా చూస్తుంటే తనకెంత ఆనందం కలిగిందీ... నిజంగా ఎంతమంది మగవాళ్లు తనను తిట్టుకోవడం లేదూ... తమ భార్యల్ని సపోర్టు చేస్తున్నానని... అందులో ఎవరో ఒకరు ఇంటికొచ్చి పోట్లాడిపోవడం లేదూ! అవన్నీ తాను వింటున్నాడా? చూస్తున్నాడా? ఇలాంటివన్నీ తనకలవాటుగా మారిపోలేదూ...

అయినా ఆరోజు రఘునందన సపోర్టు, వాడి మాటలు తనకెంత ఆనందాన్నిచ్చాయి! అమ్మ చేసే పని పట్ల ఎంత గౌరవం! మనసెంత పులకలు వేసిందీ.

దినం దినం జరిగే ఇట్లాంటి సంగతులు రెండేళ్లకొకసారి వచ్చే కొడుకుతో పంచుకోగలదా! కాలంలో కలిసిపోవూ! ఎంత కాదనుకున్నా ఒక్కో సంఘటన ఎంత ఆవేదనకు గురిచేస్తుందీ... బయటి నుండి లోపలి నుండి విమర్శలు... ఎంత వత్తిడి... అప్పటికప్పుడు దిగుళ్లు... విచారాలు... సంతోషాలు... ఎవరి నుండి తీసుకోగలదూ!... అర్థం చేసుకునేవారుంటే... చెప్పుకుంటే మనసు కరిగి ప్రవహించదూ... అవన్నీ ఎప్పుడో వచ్చే కొడుకు తీర్చగలడా! ఆనాటికవి గుర్తే వుండవు... కాలం మాన్పదూ...

'విడి విడిగా వుండాల్సి వస్తుందనే కాదూ తను ఉద్యోగం మానుకుంది. పిల్లలూ... తానూ...నేనూ తలో చోట ... కలిసి బతికే అవకాశం కోల్పోవడం యిష్టంలేకే కాదూ!'

''ఏమైందీ... చెరొకచోట అయితే... భార్యాభర్తలు అలా ఉద్యోగం చెయ్యడం లేదూ!... అన్నీ అనవసరపు ఆలోచనలు... హాయిగా ఉద్యోగంలో చేరిపో,'' తన భర్తకు సెంటిమెంట్లను పట్టుకొని వేళ్లాడటమంటే ఇష్టమే వుండదు!

స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలని చెప్పే తానే... దానిని మించి కుటుంబం... కుటుంబమంటూ, అన్ని అవకాశాలూ వదులుకోలేదూ... పాపం నా మీద అభిమానం కొద్దీ... ఆ కాలేజీ వాళ్లు ఇంటికి మనిషిని పంపల్లా రమ్మని కబురు చెయ్యలేదూ!

'నిజానికి ఆరోజుల్లో డబ్బుకు ఎంత ఇబ్బందులు పడ్డాం. చుట్టాలెవ్వరూ సహాయం చెయ్యని రోజులు... జీతాలు పెరగనిరోజులు... బాధ్యత పేరుతో చెల్లెళ్లు... జాలి పేరుతో తల్లి లేని పిల్లవాడు... వీళ్లకోసం వచ్చే చుట్టాలు... మీటింగుల కోసం వచ్చే స్నేహితులు, ఇల్లంతా జనంతో నిండి వుండేది కాదూ? వండటం, పెట్టడమే దినచర్యగా సరిపోలేదూ!... డబ్బు గురించి ఆలోచించే తీరికేదీ, అప్పులు... అప్పులు. రొటేషన్ చెయ్యలేక నలిగిపోలేదూ'

'అలాంటప్పుడు కూడా పిల్లలకు దూరంగా వుండాల్సి వస్తుందని కాదూ... ఉద్యోగానికి పోంది... ఇక్కడే ఆ ప్రైవేటు స్కూళ్లు పట్టుకుని వేళ్లాడలేదూ!'

'అలాంటిది ఎంతగా మారిపోయింది? భయం భయంగా గడప దాటనట్లుండే ఆడపిల్లలు సహితం ఉద్యోగాల కోసం దేశంలో లేని అవకాశాల వత్తిడి నుండి... విదేశాలకు ఎగరక తప్పడం లేదేమో?'

'తప్పదు... తప్పదు... జీవితం విశ్వవ్యాప్తమవుతోంది'... 'కానీ నేనే మారలేకపోతున్నాను. పాత చింతకాయ పచ్చడిలాగానా...' భర్త మాటలు గుర్తుకొచ్చి, సన్నని నవ్వు పెదాలపై పాకింది.

''ప్రతిసారీ ఉన్న నాలుగు రోజులూ సంతోషం... వెళ్లిన దగ్గర నుండి తిరిగి వచ్చేదాకా ఎదురుచూపులు... వచ్చిన ఆ నాలుగురోజులూ... ఎంత బిజీనో... ఫోన్లు, ఫ్రెండ్స్, పలకరింపులు, పార్టీలు, చుట్టాలు... గిర్రు గిర్రున సెలవలన్నీ మూడు రోజుల్లో అయిపోయినట్లు వుండటంలా! ప్రత్యేకించి కూర్చుని తీరిగ్గా మాట్లాడుకోవాలంటే... ఏం మాట్లాడుకోగలం... ఏవో పిచ్చాపాటీ తప్ప... ఎందుకో ఈ ఉరుకులు... పరుగులు... ఇంత అవసరమా జీవితాలకు.''

''మమ్మీ నీకు చెప్పడం కష్టం... ఉద్యోగాలు చేస్తూ గుంటూర్లోనే వుంటామా? ఏదో ఒకచోటికి పోమూ... అలానే ఇది కూడానూ.''

''అలా అయితే చూడాలనిపించినపుడు వెంటనే ఏ బస్సో, రైలో ఎక్కిరామూ?... బాధేముంది.''

''ఇప్పుడైనా కష్టమేముంది?... పాస్‌పోర్టు తీసుకోండి. ఎప్పుడు కావాలంటే అప్పుడు రావచ్చుగా...''

''వచ్చి ఏం చెయ్యాలి? అయినా ఎన్నిసార్లు రాగలం? అక్కడ వీకెండ్స్‌లో తప్ప నిదానంగా బతికే వీలులేదే... తమ పిల్లలతో గడిపే తీరిక తల్లిదండ్రులకే వుండటంలేదే? అందరం కలిపి సాయంకాలాలైనా గడిపే తీరికలేని చోట మేమొచ్చి ఏం చెయ్యాలి? అద్దాల్లో నుండి అమెరికా మంచు చూడటమేగా... అదీ నాలుగురోజుల్లో బోరుకొట్టదూ.''

''నీకు అర్థం చేయించలేం మమ్మీ! నువ్వు రానంటావు, వస్తే ఏం చెయ్యాలంటావు! ఎంతమంది పెద్ద వాళ్లు వచ్చి హాయిగా అక్కడే వుండటం లేదూ.''

''అవన్నీ ఎందుకురా రఘూ... నేను ఇంకా ఆ పల్లెవాసనల నుండి బయట పడలేకే ఈ బాధంతా! ... చుట్టూ జనం కావాలి, మాటలు కావాలి. వాళ్ల గొడవలు కావాలి అదే, అదే నా బలహీనత. అంతకంటే ఏం లేదు. మీరు అవకాశాలను వెదుక్కుంటూ, భవిష్యత్తు కోసం ఆకాశపు అంచులదాకా వెళ్లాలనుకుంటున్నారు... నేనేమో ఇంకా... ఇంకా, వెనక్కిపోతున్నాను... అంతే తేడా!''

''నువ్వు మమ్మల్ని అంటావుగానీ మమ్మీ... నీ విషయం ఆలోచించు... ఆ మూగచింతల నుండి ముప్పైఏళ్లనాడు రాలేదా? అప్పట్లో మీ ఊళ్లో చదువుకునే ఆడపిల్లలే లేరని నువ్వే చెప్పలేదూ? అట్టాంటి దానివి, మీ జిల్లా దాటి ఇక్కడికొచ్చి చదువుకోలేదూ?''

''నిజమే, నువ్వన్నట్టు అదీ... ఇదీ ఒకటే అనుకుందాం. కానీ నా ఈ ముప్పైఏళ్ల జీవితంలో, నా ఆలోచనలన్నీ మా వూరు చుట్టూనే లేవూ? నా ఎదుగుదలకు, నా సంఘర్షణలకు నేను తీసుకునే నిర్ణయాలకు మా ఊరు, మా జనం, ముందుకొచ్చి నా ఆలోచనల్లో కూర్చునేవారు కాదూ... ఏవీ, ఆ మూగచింతల నుండి దాటి వచ్చిన సోపానాలు... ఎక్కడ వేశావంటే, వేసినకాడే వున్నానన్న సామెత దాటివచ్చానా!''

''ఇక్కడికొచ్చి, నీళ్ల నుండి బయటపడ్డ చేపలా... ఈ కోస్తా జిల్లాల సంస్కృతికి అలవాటు కాలేక... జీర్ణించుకోలేక... అదేగా నా బాధ ఇన్నేళ్లుగా.''

''మారే కాలంతో ప్రవహిస్తున్నారు మీరు... నేను నిలబడిపోయాను అంతే... ఇది మంచా? చెడా? అన్న ప్రశ్న కాదు. మీ నాన్న అన్నట్టు ఇవి ఫ్యూడల్ విలువలే కావచ్చు. అయితే అందులో వున్న మానవ సంబంధాల దగ్గరే ఆగిపోయాను. ముందుకు రావాలంటే భయపడుతున్నాను ఉన్న ఈ కాస్త స్పందనలు కూడా పోతాయేమోనని.''

''కానీ, ఈ తరం మీరు... కాలం మార్పుల్ని సవాల్ చేస్తున్నారు, అంతే తేడా.'' రఘునందన వాదనలన్నీ నిజమే...

అయినా సుమిత్రకెందుకో కొడుకు అక్కడే వుండిపోడని, పోలేడని, అంతరాంతరాలలో ఆశగానే వుంది.

రఘునందన పెరిగిన వాతావరణం... చిన్ననాటి నుండి మనుషుల పట్ల వాడి ప్రేమ, అనుభూతులు... తిరిగి రాకుండా అక్కడే వుంచలేవనే గాఢ విశ్వాసమేదో మనసును శాంతపరచసాగింది.

'నిజానికి ఆ దేశంపైకి కనబడేంత బాగా వుండదని తెలుసుకోడానికి ఇంకా టైం పట్టవచ్చు... జాతి వైషమ్యాలతో బ్లాక్స్ పై హింస... అకృత్యాలు... హత్యలు... వాడి అనుభవంలోకి వస్తే సహించగలడా? ఓర్చుకోగలడా?'

ఇవన్నీ అనుకుంటుంటే సుమిత్రకు ధైర్యం కలగసాగింది.

'ఎప్పటికైనా మనుషుల పట్ల ప్రేమ వాడిని ఇక్కడికి లాక్కురాదూ?...'

*సుప్రభాతం పక్షపత్రిక, 10 మార్చి 2001*